క్లుప్తంగా...

పాలిసెట్ కోసం 24 వరకు గడువు

మేడ్చల్: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం వచ్చేనెల 17న నిర్వహించే పాలిసెట్ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 వరకు గడువును పొడగించినట్లు గిర్మాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

20న హోమ్ గార్డెనింగ్‌పై వర్క్‌షాప్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఈ నెల 20న హోమ్ గార్డెనింగ్‌పై ఉచితంగా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ డీన్ రాజారెడ్డి తెలిపారు. యూనివర్సిటీలోని హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే వర్క్‌షాప్‌లో ఇంటి పరిసరాల్లో గార్డెనింగ్ విధానాలపై వర్క్‌షాప్ ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యమ్నంపేట్‌లో వార్డు కమిటీ సమావేశం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యమ్నంపేట్‌లో 2వ వార్డు కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలపై చైర్మన్ కొండల్‌రెడ్డితో కమిటీ సభ్యులు చర్చించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్ నర్రి ధనలక్ష్మి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

19 నుంచి దివ్యాంగులకు బస్‌పాస్ మేళా



బస్‌పాస్ మేళా వివరాలు ప్రదర్శిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఈనెల 19–20 వరకు నిర్వహించనున్న వికలాంగుల బస్‌పాస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని చైర్ పర్సన్ పావనీ యాదవ్ అన్నారు. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని, రూ.50లు ఆర్టీసీకి చెల్లిస్తే ఏడాది వరకు బస్‌పాస్ చెల్లుబాటు అవుతుందని ఆమె అన్నారు. ఒక కలర్ ఫొటో, సదరం, ఆధార్ కార్డులు ఒరిజినల్, జిరాక్స్‌లు వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు ఫోన్: 99598 78799.

టెలిఫోన్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



బోడుప్పల్: టెలిఫోన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా సామల బుచ్చిరెడ్డి, అధ్యక్షుడిగా ఎ.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌గౌడ్, కోశాధికారిగా కె.బాలనర్సింహ, ఉపాధ్యక్షులుగా మహేందర్, ధీరజ్‌రెడ్డి, సురేందర్, వెంకటేశ్, సలహాదారులుగా దానయ్య, ప్రతాప్‌రెడ్డి, బాలరాజు, శేఖర్, రాంచందర్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్, మనోహర్‌రెడ్డి, బాలయ్య, సహాయ కోశాధికారిగా రమేష్, ప్రచార కార్యదర్శులుగా రాజశేఖర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, హాఫీజ్, వెంకన్న, రాజశేఖర్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులు వారిచే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు.

వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయండి

కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి



అల్వాల్: అల్వాల్ డివిజన్‌లో మురుగు, వరద నీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని బండబస్తీ, పాత అల్వాల్ తదితర ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న మురుగు నీరు, వర్షపు నీటి సమస్యను గుర్తించారు. సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ మల్లికార్జున్, శేఖర్, రామారావు, అరవింద్, నాగన్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటరుకు ఆహ్వానం

ఓటు నమోదుకు మరోసారి అవకాశం

- అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండితే అర్హులు
- జిల్లాలో ప్రస్తుతం మొత్తం ఓటర్లు 25.24 లక్షలు
- మార్పులు, సవరణలు, తొలగింపుల ప్రక్రియ



పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడానికి మరోసారి అవకాశం వచ్చింది. ఏటా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నా.. ఈ నెల 1వ తేదీ నుంచి వాటిని ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. నూతన ఓటు నమోదుతో పాటు పేరులో మార్పులు, సవరణలు, ఓటు తొలగింపునకు సైతం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముంది.

–సాక్షి, మేడ్చల్ జిల్లా

అందుబాటులోకి నూతన వెబ్‌సైట్..

ఓటు నమోదు నుంచి వివిధ ప్రక్రియలను ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసేందుకు పాత వెబ్‌సైట్ స్థానంలో ఎన్నికల సంఘం కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌లోనే నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎన్నికల సిబ్బంది ఫారం–6, 7, 8 తదితర దరఖాస్తులను నిక్షిప్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను పరిశీలించి తమ ఓటులోని వివరాలు పరిశీలించుకోవాలని.. అందులో ఏమైనా తప్పులుంటే సంబంధిత దరఖాస్తు ఫారం ద్వారా మీ సేవ కేంద్రం, మై ఓటర్ యాప్, ఈసీఐ వెబ్‌సైట్‌లో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఫారం–8లో కొత్త ఆప్షన్..

నూతన ఓటు నమోదుకు ఫారం 6, ఓటు తొలగింపునకు ఫారం–7, సవరణలకు ఫారం–8తో దరఖాస్తు చేసుకోవాలి. ఫారం–8లో గతంలో ఒకే నియోజకవర్గంలో మాత్రమే పోలింగ్ కేంద్రం మార్పునకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఏ నియోజకవర్గానికైనా మార్చుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో పాటు ఓటరు కార్డు పోయినా, ధ్వంసమైనా సంబంధిత ఎపిక్ సంఖ్యతో నూతన కార్డు కోసం ఫారం–8లో ఆప్షన్ ఇచ్చారు. దివ్యాంగులు తమకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రంలో మూడు చక్రాల కుర్చీ ఏర్పాటుకు సైతం ఫారం–8 కొత్త ఆప్షన్ ఇచ్చారు.

ముమ్మరంగా క్షేత్రస్థాయి పరిశీలన..

ఓటు నమోదు, సవరణ, తొలగింపులకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు చెక్ లిస్టులను సిద్ధం చేసిన ఎన్నికల సిబ్బంది వాటిని బీఎల్‌వోలకు అందిస్తున్నారు. ఆయా చెక్ లిస్టుల ఆధారంగా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన సంబంధిత ధ్రువపత్రాలను తనిఖీ చేసి యాక్సెప్ట్ లేదా రిజెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

నియోజకవర్గాల వారీగా ప్రస్తుత ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మేడ్చల్	2,85,957	2,67,786	42	5,53,785
మల్కాజిగిరి	2,23,357	2,18,693	03	4,42,053
కుత్బుల్లాపూర్	3,22,566	2,90,010	124	6,12,700
కూకట్‌పల్లి	2,24,070	2,02,276	119	4,26,465
ఉప్పల్	2,55,386	2,34,528	34	4,89,948
మొత్తం	13,11,336	12,13,293	322	25,24,951

పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలి



నాగారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

కీసర: పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నాగారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల్లో సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి పనులు చేపట్టడం మరిచి ప్రజలపై పన్నుల రూపంలో ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తోందని దుయ్యబట్టారు. ఒకే మున్సిపాలిటీలో ఒక్క వార్డులో ఒక్కో విధంగా పన్నులు వసూలు చేస్తున్నారన్నారు. గతంలో ఉన్న పనులను 600 శాతం నుంచి 1000 శాతం పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. సమస్యను అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మున్సిపాలిటీ అధికారులు, పాలకులు పెంచిన పన్నులను తగ్గించి ప్రజలకు మేలుచేయాలని, లేదంటే రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీ, బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు సురేష్, శ్యాంసుందర్‌శర్మ, బలరాం, జూపల్లి నరేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ–58 పేరుతో మోసం చేస్తున్న బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట అంటూ జీఓ–58 పేరుతో పేద ప్రజలను బీఆర్‌ఎస్ మోసం చేస్తోందని బీజేపీ పట్టణ నాయకులు ఆరోపించారు. బీజేపీ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్ మాట్లాడుతూ జీఓ–58 కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, ఎమ్మెల్యేలు, నాయకుల అనుచరులకే వర్తిస్తోందని, పేద ప్రజల దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయని అన్నారు. దీనిపై అధికారులు సమాధానం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై పట్టణంలో పోరాటం చేస్తామని అన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, మైసరి రాజు, సర్వేశ్వర్‌రెడ్డి, అర్జున్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలి

జవహర్‌నగర్: మన స్నేహం, ఎస్ఎస్ ఫ్రెండ్స్ గ్రూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి సౌజన్యంతో వచ్చేనెల 16న రవీంద్రభారతిలో మన కీర్తి అవార్డులను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మన కీర్తి అవార్డుల బ్రోచర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. పలువురి సామాజిక సేవలను గుర్తించి ఈ అవార్డులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కావేరి ధర్మేందర్, తెలంగాణ దివ్యాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్‌కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మెరుగు శివకృష్ణ, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి



ముగిసిన తైబజార్ వేలం



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో మంగళవారం తైబజార్ వేలంపాటను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అధ్యతన నిర్వహించిన కార్యక్రమంలో మల్లారం గణేష్ రూ.18.60 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. ఏడాదికాలం పాటు మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంతలో తైబజార్ రుసుమును వసూలు చేసుకునేందుకు మున్సిపల్ నుంచి గణేష్‌కు అవకాశం కల్పించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ స్వామి తెలిపారు. వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి కృషి

– జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి



మర్పల్లిగూడలో రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: ముస్లింల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. మర్పల్లిగూడలో మంగళవారం 40 మంది ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలను సర్పంచ్ మంగమ్మ, ఉప సర్పంచ్ నరేశ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమ కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ శెర్వాల్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, వార్డు సభ్యుడు వార్డు సభ్యులు ఆనంద్, మంజుల, సాయి, నాయకులు శ్రీకాంత్, రవి, స్థానికులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశాం



ఉప్పల్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: ప్రయాణికుల సౌకర్యార్థం మధురా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ట్రస్టు చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాష్ట్రం నలుమూలల నుంచి ఉప్పల్‌కు వస్తారని, వారి సౌకర్యార్థం వేసవిలో దాహార్తి తీర్చడానికి ప్రతి సంవత్సరం ఉప్పల్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పాఠశాలలను దత్తత తీసుకుని పేద విద్యార్థులకు చేయూత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలకల నరిసింహారెడ్డి, మేడ్చల్ జిల్లా మైనార్టీ చైర్మన్ అబ్దుల్ రషీద్, ఆశు, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్, వంజరి సంతోష్ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



ఆధార్ వివరాల నమోదును పర్యవేక్షిస్తున్న సర్పంచ్ కావేరి

ఘట్‌కేసర్: అవుషాపూర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ సిబ్బంది సహకారంతో గ్రామంలో ఆధార్ కార్డు లేని చిన్న పిల్లల వివరాలు అప్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మశ్చేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ ఊర్మిల, పోస్టాఫీస్ ప్రతినిధి తాహెర్, ఆశ వర్కర్ అరుణ, స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన్‌లో టాయిలెట్స్ ప్రారంభం



మూత్రశాలలను ప్రారంభిస్తున్న సర్పంచ్ నర్మదరెడ్డి

మేడ్చల్: రాయిలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్మించిన టాయిలెట్స్‌ను గ్రామ సర్పంచ్ నర్మదగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. హెచ్ఎం క్లాజ్ వారు రూ.9 లక్షలు వెచ్చించి చిన్నారుల కోసం మూత్రశాలలను నిర్మించారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించి గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన కంపెనీ ప్రతినిధులు స్టీఫెన్, థామస్ గిల్స్‌లేపొటే, ఉపసర్పంచ్ శివలక్ష్మీ, ఎంపీటీసీ అనూపశ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి, టీచర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం రద్దు చేసుకున్న డైరెక్టర్లు



డీసీఓకు అవిశ్వాసం విత్‌డ్రా పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్లు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని ఆదర్శ రైతు సేవా సహకారం సంఘం చైర్మన్‌పై పాలకవర్గ సభ్యులు పెట్టిన అవిశ్వాసం మంగళవారం రద్దు చేసుకున్నారు. గత శనివారం చైర్మన్‌పై వైస్ చైర్మన్ సహా 10 మంది డైరెక్టర్లు డీసీఓకు అవిశ్వాస పత్రాన్ని అందజేయగా మంగళవారం సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో వైస్‌చైర్మన్ సహా 8 మంది సభ్యులు అవిశ్వాసం విత్‌డ్రా చేసుకుంటున్నట్లు డీసీఓ శ్రీనివాస్‌మూర్తికి పత్రాన్ని అందజేశారు. దీంతో చైర్మన్ సుధాకర్‌రెడ్డిపై పాలకవర్గ సభ్యులు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది.

బీసీ జర్నలిస్టుల సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానం

మేడ్చల్‌రూరల్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మంగళవారం బీసీ సమాజ్ ప్రతినిధులు కలిశారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో కలిసిన వారు ఈ నెల 23న ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహిస్తున్న బీసీ జర్నలిస్టుల సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీసీ సమాజ్ అధ్యక్షుడు, బీసీ టైమ్స్ ఎడిటర్ సంగెం సూర్యారావు మాట్లాడుతూ సమాజంలో అత్యధిక శాతం జనాభా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని, బీసీలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు, వచ్చిన తర్వాత జర్నిలిస్టుల పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదని, ఉద్యోగ భద్రత లేదని, భవిష్యత్‌పై ఆశలు కూడా లేకుండా పోయాయన్నారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగపరిమళ, అపెక్స్ కమిటీ సభ్యులు సతీష్ కమాల్, మధు, చంద్రకాంత్, విద్యవెంకట్, కార్టునిస్ట్ నారు తదితరులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్‌తో బీసీ సమాజ్ ప్రతినిధులు

గోపాల్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం



బోడుప్పల్: బోడుప్పల్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కార్ అవార్డు లభించింది. రవీంద్ర భారతిలో జరిగిన ఈ అభ్యాస్ కార్యక్రమంలో శాంత బయోటెక్నిక్ చైర్మన్ పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా ఈ అవార్డును గోపాల్‌రెడ్డి అందుకున్నారు. మంగళవారం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల విద్యారంగంలో విద్యార్థులకు విద్య అందిస్తూ వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేసినట్లు వెల్లడించారు. తనకు ఈ పురస్కార అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ పురస్కారంతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఉత్తంనగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైభవంగా రుద్రహోమం

గౌతంనగర్: మాసశివరాత్రిని పురస్కరించుకొని ఉత్తంనగర్ దుర్గా జ్యోతి షాలయంలో మంగళవారం రుద్రహోమం, శివుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మూగు నాగరాజుశర్మ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.